ప్రజాశక్తి
శుక్రవారం 28 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం

చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ఆప్కోలో వస్త్రాలు కొనుగోలు చేసేవారికి రాష్ట్ర ప్రభుత్వం 30శాతం డిస్కౌంట్ ఇవ్వనునట్టు విజయనగరం డివిజన్ అప్కో మండల వాణిజ్య అధికారి బి.హరిప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45 శాతం డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయశాలల్లో ఆఫర్‌లు లభిస్తాయన్నారు. జిల్లా ప్రజలంతా ఆప్కో విక్రయ శాలలు సందర్శించి తమకు కావాల్సిన రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, రెడీమేడ్ షార్ట్స్, డ్రెస్ మెటీరియల్స్ మొదలగు చేనేత వస్త్రాలు కొనుగోలుచేసి చేనేత వస్త్ర పరిశ్రమను ప్రోత్సహించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని కోరారు.

రియల్ మోసం 'గురూ'

- భూమి ధర తగ్గించి రిజిస్ట్రేషన్ ఫీజు కోత
- సర్కారు ఖజానాకు రూ.12 లక్షలు కన్నం
- లంచాల మత్తులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ధర తగ్గించి రిజిస్ట్రేషన్ చేసిన స్థలం

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లా కేంద్రమైన తర్వాత పార్వతీపురం పట్టణం నగరంగా రూపుదిద్దుకుంటోంది. పట్టణ విస్తీర్ణం క్రమేణా పెరుగుతూ వస్తోంది. భూముల ధరల పెరుగుతున్నాయి. రియల్ ఎస్టేట్ మోసాలైతే వేగంగా జరుగుతున్నాయి. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. పట్టణం నడిబొడ్డున బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమి చదరపు గజం విలువ రూ.26వేలు పలుకుతోంది. చదరపు గజం విలువ ఎంత వుంటే దానికి తగినంత రిజిస్ట్రేషన్ ఫీజును చలానా రూపంలో కొనుగోలు దారులు చెల్లించాల్సి ఉంది. అయితే బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 336లో సుమారు వెయ్యి చదరపు గజాల భూమి విక్రయానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ గత ఏడాది డిసెంబర్‌లో జరిగింది. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు అతి తెలివి ప్రదర్శించి ఇదే సర్వే నెంబర్‌తో ఒక కిలో మీటర్ దూరంలో ఉన్న బండివీధి ప్రాంతంలో గల భూమి అని చూపించి రిజిస్ట్రేషన్ ఫీజు కోత పెట్టారు. బండివీధిలో చదరపు గజం భూమి విలువ రూ.8వేలు ఉంది. బైపాస్ రోడ్డుకు ఆనుకుని సర్వే నెంబర్ 336లో ఉన్న వెయ్యి చదరపు గజాల భూమిని బండి వీధి సమీపంలో ఉన్నట్లు చూపించడంతో రిజిస్ట్రేషన్ ఫీజు విలువ భారీగా తగ్గింది. దీనివల్ల రిజిస్ట్రేషన్ ఖజానాకు రూ.12లక్షల ఆదాయం తగ్గింది. బండివీధిలో చదరపు గజం విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీనిపై గత ఏడాది డిసెంబర్‌లోనే జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ జరిపించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్‌ను ఆదేశించారు. వెంటనే ఆమె ఈ విషయంపై విచారించారు. బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 336లో భూమిని పరిశీలించారు. సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న బండి వీధి ప్రాంతంలోని భూమి అని చూపించి రిజిస్ట్రేషన్ ఫీజులో కోత పెట్టారనే వాస్తవాన్ని ఆమె నిర్ధారించారు. అయితే విచారించి రెండు నెలలైనా ఇంతవరకు జిల్లా కలెక్టర్‌కు జిల్లా రిజిస్ట్రార్ నివేదిక అందజేయలేదు. దీనికి కారణం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమేనన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 336లో విక్రయమైన వెయ్యి చదరపు గజాల భూమి ఏ ప్రాంతంలో ఉందో నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రార్ మండల తహశీల్దార్‌కు లేఖ రాశారు. అదే విధంగా మున్సిపల్ రెవెన్యూ అధికారులకు కూడా లేఖ రాశారు. ఈ భూమి బైపాస్ రోడ్డు పక్కన ఉందా, బండి వీధి సమీపాన ఉందా అనేది రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సి వుంది.

రెవెన్యూ జాప్యం వెనుక రియల్ మాఫియా

సర్వే నెంబర్ 336లో ఉన్న వెయ్యి చదరపు గజాల భూమి ఏ ప్రాంతంలో ఉందో నిర్ధారించి నివేదిక ఇవ్వాల్సిన మండల రెవెన్యూ అధికారులు తాత్సారం చేయడం వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భూమి ఏ ప్రాంతంలో వున్నదో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌తో సహా ఇతర రెవెన్యూ జిల్లా అధికారులు మండల తహశీల్దార్‌ను ఆదేశించిన రెండు నెలలైనా ఇవ్వడం లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ చేసిన విచారణ నివేదికను అందజేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మున్సిపాలిటీలో సర్వే అధికారులు లేరని చెప్పి మున్సిపల్ రెవెన్యూ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేశారు. తప్పించుకోడానికి వీలు కాని పరిస్థితిలో ఉన్న మండల తహశీల్దార్ కాలయాపన చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్ ఎస్టేట్ మాఫియా ఒత్తిళ్ల వల్లే రెవిన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లంచాల మత్తులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు లంచాల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏ ప్రాంతంలో భూమి విలువ ఎంతనేది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులకు బాగా తెలుసు. అయినా పట్టణం నడిబొడ్డున బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమిని బండి వీధి సమీపంలో ఉన్నట్లు చూపించి రిజిస్ట్రేషన్ చేయడం వెనుక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బందికి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ రిజిస్ట్రేషన్లకు దండిగా ముడుపులు దండుకోవడంలో బిజీగా వుండే రిజిస్ట్రేషన్ అధికారులు ప్రభుత్వ ఖజానాకు కన్నం పడుతుంటే గమనించలేకపోవడం గమనార్హం.

రెవెన్యూ నివేదిక రాగానే చర్యలు



సర్వే నెంబర్ 336లో బైపాస్ రోడ్డును ఆనుకొని ఉన్న భూమి విక్రయానికి సంబంధించిన వ్యవహారంలో బండి వీధి సమీపంలో ఉన్నట్లు చూపించి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించిన విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆ మేరకు విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. డిసెంబర్‌లోనే విచారణ చేపట్టాను. బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 336 భూమి బండి వీధికి సుమారు కిలోమీటరు దూరంలో ఉంది. దీంతో ఆ భూమి ఏ ప్రాంతంలో ఉందో నిర్ధారించి నివేదిక ఇవ్వాలని మండల తహశీల్దార్ కార్యాలయానికి రెండు నెలల క్రితమే లేఖ రాశాను. ఇంతవరకు నివేదిక ఇవ్వలేదు. జిల్లా రెవెన్యూ అధికారుల దృష్టికి మండల తహశీల్దార్ జాప్యం చేస్తున్నారనే విషయాన్ని తీసుకెళ్లాను. జిల్లా అధికారులు ఆదేశించినా ఇంతవరకు తహశీల్దార్ కార్యాలయం నుంచి నివేదిక రావడంలేదు. మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాను. రెవెన్యూ నివేదిక ఆధారంగానే తాను విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాను. ఒకవేళ ఆ భూమి బైపాస్ రోడ్డు ప్రాంతంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు నివేదిక అందజేస్తే సంబంధించిన అండర్ వాల్యూ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తాం. రిజిస్ట్రేషన్ ఫీజులో కోత పెట్టిన మొత్తాన్ని చెల్లించాలని నోటీసు జారీ చేస్తాం.

రామలక్ష్మి పట్నాయక్, జిల్లా రిజిస్ట్రార్, పార్వతీపురం

పోలీసు, అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి

ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుపై

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

పనులను అడ్డుకున్న సిపిఎం నాయకులు, బాధిత గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఏనుగుల జోన్ ఆపాలని పోరాటం జరుగుతున్నా, సమస్యల పరిష్కరిస్తామన్న అధికారులు దౌర్జన్యంగా పోలీసులు సహకారంతో పనులు చేయిస్తున్నారని, ఇందుకు నిరసనగా శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి వేణు పిలుపునిచ్చారు. మండలంలోని అమ్మాదేవి కొండ పరిధిలో అటవీ శాఖ అధికారులు ఏనుగుల జోన్ కోసం పనులపై అధికారులు ఒకవైపు గ్రామస్తులతో చర్చలు జరుపుతుండగా, గురువారం మళ్లీ అటవీశాఖ అధికారులు, పోలీసులు సహకారంతో రిజర్వ్ పోలీసుల్ని మోహరించి పనులు యంత్రాలతో పనులు చేపట్టారన్నారు. పనులు జరుగుతున్న విషయాన్ని బాధిత గ్రామాల ప్రజలు సిపిఎం నాయకులకు సమాచారం ఇచ్చిన ఇవ్వగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పనులు జరుగుతున్న చోటకు వెళ్లారన్నారు. ప్రజలను పనుల వద్దకు రాకుండా మూడు చోట్ల పోలీసులు మొహరించి, అప్పయ్యపేట, తామరకండి ప్రజలను తామరకండి రేవు వద్ద రెడ్డి ఈశ్వరరావు, రామారావును, రేపటివలస, తాన సీతారాంపురం, చిన్న రాయుడుపేట, గుచ్చిమి ప్రాంతాల నుంచి మూడడ్ల కృష్ణమూర్తి, రెడ్డి వేణు, గవర వెంకటరమణతో వచ్చిన ప్రజలను రేపటి వలసలో గల పామాయిల్ తోట వద్ద అడ్డుకున్నారు. ఇది సరైనది కాదు సిపిఎం నాయకులు తెలపడంతో రెండు చోట్ల ఉన్న వారిని ఒక దగ్గరికి తెచ్చి చర్చించారు. గిరిజనులు, దళితులు సాగు చేస్తున్న భూములకు రక్షణ కల్పించాలని ఆర్ఒఎఫ్ఆర్ 50ఏళ్ల డి పట్టా, లీజు పట్టాలు కలిగిన సాగు భూములకు, చెట్లకు నష్టపరిహారం ఇప్పించి బాధితులకు న్యాయం చేయాలని, తగు న్యాయం జరిగే వరకు పనులు చేపట్టవద్దని సిపిఎం నాయకులు తెలిపినా, అధికారులు మొండిగా వ్యవహరిస్తే ఎటువంటి అరెస్టులు, కేసులకు భయపడి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. బాధితులకు పూర్తిస్థాయి పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని అంతవరకు పనులు చేపట్ట వద్దని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరుగు నిరసనలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని, ఏనుగుల జోన్ ఆపి గిరిజనుల నష్టపరిహారం కోసం చర్యలు చేపట్టాలని తదితర కార్యాచరణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, రేపటి వలస గ్రామానికి చెందిన జన్ని శ్రీధర్, తౌడన్నదొర, చిన్నరాయుడుపేటకు చెందిన దినేష్, తవుడు,సింహాచలం, సీతారాంపురం అప్పారావు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తారు విందులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సన్మార్గానికి మారు పేరు రంజాన్ : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురం

క్రమశిక్షణకు, సన్మార్గానికి మారుపేరు పవిత్ర రంజాన్ మాసమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మాసంలో ముస్లింలు ఆధ్యాత్మికంగా మరింతగా లగ్నమై ఉంటారని, దైవానికి దగ్గర కావడమే కాకుండా దాతృత్వం, కరుణ, సహనం వంటి మంచి లక్షణాలను పెంపొందించుకుంటారని కొనియాడారు. ముఖ్యంగా పేదలకు సహాయం చేయడం వంటి మంచి పనులను చేయాలని భావిస్తారని అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడాతూ ముస్లింలకు ముందుగా రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.అల్లాహ్ పట్ల ఎంతో భక్తి శ్రద్ధలు, క్రమశిక్షణతో రంజాన్ మాసాన్ని ముస్లింలు పాటిస్తారని కలెక్టర్ గుర్తుచేశారు. రంజాన్ మాసాన్ని కేవలం ముస్లింలే కాదు అందరూ గౌరవిస్తారని, సోదర భావంతో మెలిగే ఈ పవిత్ర రంజాన్ కార్యక్రమంలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం, సమానత్వం, సంప్రదాయం, ఆచారాలను స్వేచ్ఛగా చేసుకోవచ్చని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను అమలుచేస్తుందని అన్నారు. జిల్లాలో ముస్లిం సోదరులకు స్మశాన వాటిక సమస్య ఉన్నట్లు మత పెద్దలు తమ దృష్టికి తీసుకొచ్చారని, త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇవేకాకుండా ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అవసరమైన మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ ఆర్.ఎస్.జాన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.డీ.గయాజుద్దీన్, సిపిఒ పి.వీర్రాజు, ఉర్దూ లైబ్రరీయన్ కుదుష్, మత పెద్దలు, ఇమామ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను సంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం ఉగాది వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో స్థానిక లయన్స్ కళ్యాణ మండపం వేదికగా ఈనెల 30న ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు ఉండాలన్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంగళ వాయిద్యాలు, పంచాంగ శ్రవణం, వేద పండితుల ఆశీర్వచనం, ఉగాది పచ్చడి, పులిహోర వంటి ప్రసాదాల ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలని తెలిపారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు ఘనంగా దుస్సాలువ, జ్ఞాపికతో సత్కరించాలని కలెక్టర్ వివరించారు. ఉగాది నేపథ్యంలో ప్రతి జిల్లా అధికారి సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని డిఆర్ఒ పర్యవేక్షిస్తారని కలెక్టర్ వివరించారు.

సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, డిఆర్ఒ కె.హేమలత, డిపిఆర్ఒ ఎల్.రమేష్, డీఆర్డిఎ,డ్వామా, ఐసీడిఎస్ పీడీ సుధారాణి, కె.రామచంద్రరావు, డాక్టర్ టి.కనకదుర్గ, జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.శ్యామల, ఐటీడిఎ ఏపీఓ మురళీధర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పదోతరగతి మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు కోరారు. ఈ మేరకు గురువారం వారు డిఇఒ ఎన్.తిరుపతి నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు, హిందీ సబ్జెక్టులకు పార్వతీపురం కేంద్రంలో మూల్యాంకనం చేసే సౌకర్యం కల్పించాలని కోరారు. అలా కాని పక్షంలో విజయనగరం కేంద్రంలోనైనా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పదోతరగతి మూల్యాంకన బాధ్యతలు నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, బాలింతలు, గర్భిణులను మినహాయించాలని కోరారు. పదోతరగతి సబ్జెక్టు బోధించని వారికి కూడా మినహాయింపు ఇవ్వాలని కోరారు. మూల్యాంకన కేంద్రంలో మజ్జిగ, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి- సాలూరు

మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనుంది. ఈ సమావేశానికి అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్‌లు హాజరు కావాలని కమిషనర్ బివి ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

కార్యకర్తలకు అండగా ఉంటాం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి టిడిపి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తుందని రా గిరిజన సంక్షేమశాఖా వమంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో 40వేల మంది కార్యకర్తలు సభ్యత్వాల నమోదు చేసుకున్నారని, పార్టీ బలోపేతానికి కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. సభ్యత్వ పెంపును మాత్రమే కాకుండా సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తను పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయికి ప్రతి కార్యకర్త అభివృద్ధి చెందేలా పార్టీ ప్రణాళికలను అమలు చేయబోతున్నట్లు తెలిపారు. పార్టీలో కొత్తగా చేరిన సభ్యులకు పార్టీ విధానాలు, ప్రభుత్వ పథకాలు, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, స్థానిక స్థాయిలో పరిష్కారం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

సిఎం సహాయ చెక్కులు అందజేత

అనంతరం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకొన్న వారికి అక్కడయ్యే ఖర్చులు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందజేస్తుందని, దీని కోసం ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పేదలకు ఉపయోగపడేలా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజుదేవ్, రాష్ట్ర కార్యదర్శి ముఖీ సూర్యనారాయణ, పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుల్ల వేణుగోపాల్‌నాయుడు, పాచిపెంట మండల ప్రధాన కార్యదర్శి గూడెపు యుగంధర్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, బూత్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వొద్దని, ఉద్యోగాలు పర్మినెంట్ కోసం ఐక్యంగా పోరాడుదామన్న నినాదంతో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నాయకులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు వినతిని ఇచ్చేందుకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి పొరుగు సేవల సిబ్బందిని ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలన్నారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పట్టణాల పరిశుభ్రతకు మున్సిపల్ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని, అందుకోసం జరుగుతున్న పోరాటంలో మున్సిపల్ కార్మికులంతా కలిసి రావాలని అన్నారు. కార్యక్రమంలో మామిడి శివ, బంగారి, రాజేష్ గుంట్రెడ్డి గంగయ్య, బంగారు రవి, సుజాత పాపులమ్మ, లక్ష్మి, ఇప్పలమ్మ, డ్రైవర్లు, మేస్త్రిలు పాల్గొన్నారు.

పాలకొండ : నగర పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కరపత్రాలను విడుదల చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ పేమెంట్ చేయాలన్నారు. మార్చి 10న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అయితే ఈ ప్రభుత్వం తమ సమస్యల పట్ల పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తామని ప్రకటించిందని, దానికంటే మెరుగైన వ్యవస్థ తీసుకురావాలన్నారు. లేకుంటే కార్మికులందరూ కాంట్రాక్టు చేతుల్లో బలిపశువులవుతారన్నారు. ఈ మేరకు పురపాలక శాఖ మంత్రి నారాయణకు సంతకాలు సేకరణతో వినతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చింతల సంజీవి, పడాల వేణు, శ్రీదేవి, విమల, ఆంజనేయులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సంతకాలు సేకరణ

పార్వతీపురంలో సంతకాలు సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు

నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ధ్రువపత్రాల పరిశీలన

పార్వతీపురం రూరల్ : మండలంలో బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి తెలిపారు. కావున దరఖాస్తుదారులు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలన చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులతో, మండల కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

పక్కా డాక్యుమెంట్లతో రీసర్వే : జెసి

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలో జరుగుతున్న రెండో విడత రీసర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా ఉండాలని, సమగ్ర విచారణ చేపట్టి తుది నిర్ణయం తీసుకోవాలని సంయుక్త కలెక్టర్ ఎస్ఎస్ శోబిక సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని విక్రంపురంలో గురువారం ఆమె పర్యటించి రెండో విడత రీసర్వే పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రశీదులను పొందాలని స్పష్టం చేశారు. భూముల రీసర్వేలో తలెత్తిన లోపాలను భూయజమానికి ముందుగా నోటీసు ద్వారా తెలియజేయాలని ఆదేశించారు. వివాదస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. రీసర్వేలో ఎక్కడ లోపాలు ఉండరాదని, అందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని జెసి స్పష్టం చేశారు. రీసర్వే చేసిన సమయంలో నాలుగు పక్కల ఉన్న రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే రీసర్వే ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. రీసర్వే జరిగినప్పుడు గతంలో జరిగిన తప్పిదాలను సరి చేసేందుకు అవకాశం ఉంది కాబట్టి రైతుల సమక్షంలోనే అధికారులు రీ సర్వే పనులు చేపట్టాలని అన్నారు. ఇప్పుడు జరుగుతున్న రీసర్వేలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా సమగ్ర విచారంతో రికార్డులను సిద్ధం చేసుకుని పనులు చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వే పనుల్లో ఆలస్యం, నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా రీసర్వే పనులు జరగాలన్నారు. రీసర్వే జరుగుతున్న సమయంలో ఆయా రైతులు తప్పనిసరిగా దగ్గరుండి సర్వే చేయించుకోవాలని సూచించారు. ఈ పర్యటన కార్యక్రమంలో తహశీల్దార్ కె.శివయ్య, మండల సర్వేర్ వంశీకృష్ణ, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రజ్ఞా వికాసం'లో గిరిజన విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కురుపాం :

పదో తరగతి విద్యార్థులకు గతనెలలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాసం పరీక్షలో కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి బిడ్డక శ్రీరామ్ మన్యం జిల్లాలో తృతీయ బహుమతి గెలుపొందారు. గురువారం ఆ పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థి శ్రీరామ్‌కు రూ. 2వేలు నగదు, మెమొంటోను యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీరాములు, జిమ్మమ్మవలస మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి టి.శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.రాజు, నాయకులు అఖిల్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామ గోవిందం, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

విద్యార్థికి నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

ఏనుగు పిల్ల జననం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో అడవి ఏనుగుల సంఖ్య పెరుగుతూ కనిపిస్తోంది. గురువారం ఉదయం ఒక ఏనుగు పిల్ల జన్మించింది. ఇప్పటివరకు ఏడు ఏనుగుల గుంపు ఉండగా పిల్ల ఏనుగుతో ఆ సంఖ్య ఎనిమిదికి చేరింది. తల్లి, పిల్ల ఏనుగులు సురక్షితంగా ఉన్నాయని ఎలిఫెంట్ మోనిటరింగ్ అధికారి మణికంఠేశ్ తెలిపారు. గత రెండేళ్లలో రెండు ఏనుగు పిల్లలు జన్మించాయని తెలిపారు.

ఏజెన్సీలో మలేరియా తగ్గాలి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట మన్యంలో మలేరియా తగ్గాలని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం భోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. మలేరియా మరణాలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం కచ్చితంగా నిర్వహించాలన్నారు. ఈ మండలానికి 4వేల దోమతెరలు వస్తాయని తెలిపారు. ఆర్డీ కిట్స్ కచ్చితంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా రోగికి 14 రోజులు పక్కాగా వైద్యం అందించాలని రేడికల్ వైద్యం నిర్వహించాలన్నారు. మలేరియా మందులు, కిట్లు, ఇంజక్షన్లు కచ్చితంగా ఉంచుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో దోను బాయి వైద్యాధికారి భాను ప్రతాప్, సబ్ యూనిట్ అధికారి మోహన్ రావు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - సీతానగరం

రబీ పంటకు సంబంధించి యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎ. ఎస్. అవినాష్ తెలిపారు. మండలంలోని నిడగల్లు రైతుభరోసా కేంద్రం వద్ద యూరియా నిల్వలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణపై బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు గురువారం సాయంత్రం నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆపద సమయంలో వారికి వారు ఆత్మరక్షణ చేసుకునే విధానంపై ట్రైనీ ఎస్ఐలతో మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ మహిళపై నిత్యం జరుగుతున్న దాడుల నుంచి ఏ విధంగా బయటపడాలి, వారికి వారు ఎలా రక్షించుకోవాలి అనే విషయంపై అవగాహన కల్పించి విద్యార్థి దశ నుండే సక్రమంగా చదువుకొని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని కుటుంబానికి భరోసాగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతదేహం ఖననంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

సీతానగరం మండలంలోని రంగంపేట పంచాయతీ అనంతరాయుడు పేట గ్రామంలో దళితుల నివాసాలకు దగ్గరలో వున్న కొండ జాగాలో పెత్తందార్లు మృతదేహాన్ని ఖననం చేయడం పై కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకులు వై.మన్మధరావు ఆధ్వర్యాన దళితులు గురువారం డిఆర్ఓ కె.హేమలత, జిల్లా పోలీసు అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన పెత్తందార్లు పోల తిరుపతి రావు, దాలినాయుడు, అప్పలనాయుడుల తల్లి ఈనెల 26న మరణించగా, ఆమె మృతదేహాన్ని దళిత పేట దగ్గరలో వున్న కొండ జాగాలో ఖననం చేశారని చెప్పారు. దీనిపై దళితపేటలో వున్న పిల్లలు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. అక్రమ ఖననం చేయొద్దని చెప్పినా వినలేదని తెలిపారు. మండల పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. తగిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళితులు తిరుపతి, సింహాచలం, రాము, గౌరు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన పైపులైనుకు మరమ్మతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండల కేంద్రంలో ఉన్న ప్రధాన రక్షిత మంచినీటి ట్యాంకు నుంచి గ్రామంలోకి వస్తున్న ప్రధాన పైపులైను ఇటీవల బద్దలైన కారణంగా గ్రామంలో మంచినీటి సరఫరా గత నాలుగు రోజులుగా నిలిచిపోయింది. ఈ మేరకు స్థానిక పంచాయతీ సర్పంచ్ గౌరీ శంకర్‌రావు గురువారం పాడైన పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ సంత ఆవరణలో ఉన్న ప్రధాన పైపులైనుకు పంచాయతీ సిబ్బంది బోరు మెకానిక్ సహకారంతో మరమ్మతులు చేపట్టామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పంచాయతీ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీలో ఎక్కడైనా ఎటువంటి తాగునీటి సమస్యలు ఎదురైన తమకు తక్షణమే సమాచారం అందించాలని అన్నారు.

రెండు వారాల ఆదాయం రూ 4.11 లక్షలు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర గిరిజన ఆరాధ్య దేవతగా వెలుగొందుతున్న పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా 8వ మంగళవారం నుండి 9వ మంగళవారం వరకు చదురు గుడి వనం గుడిల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారి రాజారావు సమక్షంలో లెక్కింపు కార్యక్రమం చేపట్టినట్లు ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా చదురుగుడి హుండీలు ద్వారా రూ.2,94,984లు, వనం గుడి హుండీల ద్వారా రూ.1,16,204లు మొత్తం రూ.4,11,188 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెదుళ్ల సింహాచలమమ్మ, మాజీ చైర్మన్ దాలినాయుడు, వైస్ చైర్మన్ అల్లు వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నైదాన తిరుపతిరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూల ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 100 యూనిట్లకు సంబంధించి 649 మంది దరఖాస్తుదారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు, డిసిసిబి, యూనియన్, ఎపిజివిబి బ్యాంక్ మేనేజర్లు రవికుమార్, ఎస్ పార్వతి, ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని, ఈ ధర్నాలో ఉపాధి కూలీలు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొనాలని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహన్‌రావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో గత ఏడు వారాలుగా చేసిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలంతా ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిపిన పాదయాత్ర సందర్భంగా అనేక మంది వ్యవసాయ కార్మికులు తన గోడును వెల్లబుచ్చుకున్నారని అన్నారు. పెండింగ్ ఉపాధి బిల్లు చెల్లించాలని అనేకమార్లు విన్నవించుకున్నామనిన్నారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలైన మంచినీరు, ప్రథమ చికిత్స పెట్టే గుణపాం, పారలు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలనే డిమాండ్‌తో కలెక్టర్ ఆఫీస్ ముందు జరుగు ధర్నాలో ఉపాధి కూలీలంతా పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, నాయకులు పూవ్వల ప్రసాదు, పత్తిక మోహన్ రావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు వస్త్రదానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లిలో గల లెప్రసీ వ్యాధిగ్రస్తులకు గురువారం పెదపెంకికి చెందిన సామాజిక సేవాకర్త, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు, కుటుంబ సభ్యులు సమక్షంలో వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ తన తల్లి 7వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. తల్లిదండ్రులను మరణం తర్వాత కాకుండా బతికున్నప్పుడు కూడా ఇలా కుటుంబ సభ్యులను గౌరవించే వారిని, అలాగే మరణం తర్వాత కూడా ప్రతి ఏటా ఇలా పేదలకు సేవ చేయడం మంచి కార్యక్రమమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవనాయుడు భార్య కళావతి, అన్నదమ్ములు పెంట నాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిర, మండల నాయకులు ఎన్.సింహాచలం మాట్లాడుతూ మేజర్ పంచాయతీ పరిధిలో 64 వీధుల్లో 14,315 మంది జనాభా ప్రజలకు కనీసం తాగడానికి మంచినీరు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వం లెక్క ప్రకారం ప్రతి మనిషికి 60 లీటర్లు నీరు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఆ లెక్కలో జనాభాకు తగినట్లు నాలుగు లక్షల లీటర్ల నీరు ఇవ్వాలన్నారు. జనాభాకు సరిపడా నీరు ఇవ్వకపోవడం మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇచ్చిన అరకొర నీరు కూడా శుద్ధమైన నీరు ఇవ్వటం లేదన్నారు. జల జీవన్ మిషన్

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నిధులతో ఇంటింటికి కుళాయిల ఇచ్చి నీరు అందించాలన్నారు. వీధుల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, ఎక్కడికక్కడే మురుగునీరు చెత్త దుర్గంధంతో దోమలతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. రోడ్లు పాడైపోయి గోతులతో ఉండటంతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు వాణిజ్య సముదాయాలు ఇచ్చిన పన్నుల డబ్బులు పంచాయతీ ఆర్థిక సంవత్సర నిధులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారులు పన్నులు వసూలు చేయడమే వారి పని అని భావిస్తున్నారని, తక్షణమే పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించి రోడ్లు, కాలువలు మరమ్మతులు చేసి పారిశుధ్య మెరుగు పర్చాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇఒ బి. కోటేశ్వరరావు, ఎంపిడిఒ బి.వెంకట రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ చిన్నతల్లి, కె.దాలమ్మ, ఎం.కళావతి, దుర్గ, బి.అప్పయ్యమ్మ, గౌరమ్మ, దేవి, కే.లక్ష్మి, జే.గోవింద, శివ, రాము పాల్గొన్నారు.

రుణ వార్షిక ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకంపేటలో గురువారం డిఆర్‌డిఎ పీడీ సుధారాణి అధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామంలోని పొదుపు మహిళా సంఘాల సభ్యులకు చిన్న సంఘాల 2025 -26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళికలు క్రెడిట్, జీవనోపాదుల ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రాక్టికల్‌గా మొబైల్ యాప్ ద్వారా గ్రామంలో మొబైల్ యాప్ ద్వారా ప్రాక్టీస్ చేయించడం జరిగింది. సభ్యులతో మాట్లాడుతూ యాప్‌లో డౌన్‌లోడ్ చేయడం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎపిడి వై.సత్యంనాయుడు, డిపిఎం ఫైనాన్స్ అప్పారావు, ఐబి సింహాచలం, ఎపిఎం సన్నిబాబు, బ్యాంకులు లింకేజి ఎపిఎం శివునాయుడు పాల్గొన్నారు.

జిసిసిని నిర్వీర్యం చేస్తే సహించం

ప్రజాశక్తి - మక్కువ

జిసిసిలను నిర్వీర్యం చేస్తే సంహించమని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సీదరపు అప్పారావు, మక్కువ మండల నాయకులు తాడంగి ప్రభాకర్ రావు అన్నారు. ఈ నెల 29న పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల వద్ద జరిగే ధర్నా కార్యక్రమంపై గురువారం దుగ్గేరు సంత వద్ద ప్రచారం చేశారు. అనంతరం గిరిజన గ్రామాలలో పర్యటించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో జీడి పండిస్తున్న రైతులకు ఒక కేజీ జీడి పిక్కకు 200 రూపాయలు ధర చెల్లించి, జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని, గిరిజన ప్రాంతంలో ఉన్నత విద్యా చదువులకు డిగ్రీ, పీజీ, బీఈడీ, మెడికల్ ప్రొఫెషనల్ కోర్సులు ప్రభుత్వమే విద్యాసంస్థలు నెలకొల్పి అభివృద్ధి చేయాలని, గిరిజన యూనివర్సిటీని గిరిజన ప్రాంతంలో నిర్మాణం పూర్తి చేసి, వాడుకలోకి తేవాలని, విద్యార్థులు డ్రాప్స్ పెరిగే నూతన విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో వంద పడకల హాస్పిటల్స్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రాంత ప్రజల పంటలకు గిట్టుబాటు ధర లేక దళారుల చేతుల్లో పడి

కరపత్రాలతో ప్రచారం చేస్తున్న నాయకులు

మోసపోతున్నారని, ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల గిరిజన ప్రాంత ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, జీవో నెంబర్ 3 అమలు చేయకపోవడం వల్ల అన్ని విధాలుగా ఉద్యోగాలు, భూములపై హక్కులు కోల్పోతున్న పరిస్థితి ఉందని గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం మోసం చేయకుండా నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన సంఘం నాయకులు ఎస్ రాము, జి. అప్పన్న, ఎస్ బాలకృష్ణ, పాల్గొన్నారు.

'అది ఏనుగుల జోన్ కాదు'

అటవీ రేంజ్ అధికారి రామ్ నరేష్

ప్రజాశక్తి- పార్వతీపురం

గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో ఏనుగుల జోన్ ఏర్పాటు చేయడం లేదని అటవీ రేంజ్ అధికారి బి.రామ్‌నరేష్ స్పష్టం చేశారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఏనుగుల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న ఆశ్రయ కేంద్రం మాత్రమే నని చెప్పారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఆస్తి, ప్రాణ నష్టాలకు కారణ మవుతున్న ఏనుగులను తాత్కాలిక ఆశ్రయ కేంద్రంలోకి తీసుకొచ్చి మూడు, నాలుగు నెలల పాటు వాటికి మావటీలతో శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. కుంకీ ఏనుగులతో అడవి ఏనుగులకు శిక్షణ ఇప్పించిన తర్వాత వాటిని ఇక్కడ నుంచి సురక్షితమైన నల్లమల అడవుల్లోకి తరలించే ఆలోచన వున్నట్లు తెలిపారు. అంతేకానీ ఆ ఏనుగులను శాశ్వతంగా గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్‌లో వుంచే ఉద్దేశం లేదని చెప్పారు. 1100 ఎకరాల్లో గుచ్చిమి రిజర్వు ఫారెస్ట్ విస్తరించి వుందని, ఈ మొత్తం ప్రాంతంలో ఏనుగులకు ఆశ్రయ కేంద్రం ఏర్పాటు చేయబోయమని చెప్పారు. 100 నుంచి 150 ఎకరాల్లో ఏనుగులకు తాత్కాలిక ఆశ్రయ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని కోసమే కేంద్రం చుట్టూ కందకాలు తవ్విస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ప్రజలకు ప్రజాసంఘాల నాయకుల సమక్షంలో అవగాహన కల్పించామని చెప్పారు. త్వరలో మళ్ళీ కందకాల తవ్వించే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇంతవరకు ఏనుగుల దాడుల్లో 13 మంది మరణించారని, 3 కోట్ల రూపాయల వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం కింద పంపిణీ చేసిందని తెలిపారు. ఏనుగుల సమస్యకి శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం తాత్కాలిక ఆశ్రయ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని చెప్పారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50లక్షలు మంజూరు చేసిందన్నారు. ప్రజల భూముల సాగుకు ఎలాంటి ఆటంకం వుండబోదని ఆయన స్పష్టం చేశారు.

జిపిఎస్ పాఠశాలలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - పాచిపెంట

ఉపాధ్యాయుల కొరతతో రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నాయని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని పద్మాపురం పంచాయతీ రోడ్డవలస జిపిఎస్ స్కూల్‌ను గురువారం ప్రజాసంఘాల నాయకులైన కోరాడ ఈశ్వరరావు (సిఐటియు), పాముల సన్యాసిరావు, గిన్నెల నాగరాజు (గిరిజన సంఘం) పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రోడ్డవలస జిపిఎస్ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలిని డిప్యూటేషన్‌పై గుమ్మడిగుడ్డువలసలోని జిపిఎస్ స్కూల్లో పిల్లలకు చదువు చెప్పడానికి పంపించడం వల్ల రొడ్డవలసలో ఉన్నటు వంటి స్కూళ్లకు తాళాలు వేసి మూతపడింది. ఇలా చూసుకుంటే గుమ్మడిగుడ్డివలసకు పాఠశాలలో చదువు చెప్పడానికి వెళ్లడం కోసం కుంబీవలస, ఆజూరు నుంచి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడానికి వెళ్లిన సందర్భంగా వారు చదువు చెప్పున్నటువంటి స్కూళ్లు మూతలు పడుతున్నాయని దీనివల్ల గిరిజన పిల్లలు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గిరిజన గ్రామాల్లో స్కూల్లో టీచర్

మూతపడిన పాఠశాలను పరిశీలిస్తున్న ఈశ్వరరావు

రాకపోవడంతో పిల్లలు తల్లిదండ్రులతో పోడు భూముల్లో పనులకు, చింతపండు ఏరడానికి, జీడి తోటలకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్ని జిపిఎస్ స్కూళ్ల పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని, పాఠశాలల విద్య పట్ల నిర్లక్ష్యధోరణిని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని ఎంఇఒలు, డిఇఒలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆలయ అభివృద్ధికి కలిసి పోరాడాలి

ప్రజాశక్తి- గరుగుబిల్లి

దశాబ్దాలుగా పూజలందుకుంటున్న తోటపల్లి దేవాలయ వెంకటేశ్వర స్వామి వారి భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటామని తోటపల్లి పరిసర గ్రామాల ప్రజలు గురువారం తీర్మానించారు. దేవాలయం పునర్నిర్మాణం చెందుతున్న దశలో ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దేవాలయానికి విశ్రాంత స్టేషన్ మాస్టర్ మార్కొండ అప్పలస్వామి దానమిచ్చిన 44 సెంట్ల స్థలంలో హద్దులు లేవన్న కారణంతో దేవాలయం మాజీ ఉద్యోగి దేవాలయం ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నా ఇఒ వివి సూర్యనారాయణ తనకేమీ పట్టనట్లు ఉండడం పట్ల సమావేశం తప్పుపట్టింది. అదేవిధంగా 50ఏళ్లుగా దేవాలయం అనుభవంలో ఉన్న స్థలంలో పేదవారికి షాపులు కట్టిస్తే ఆ షాపుల్లో రెండింటిని ఫిర్యాదుదారులకు ఇవ్వమని వొత్తిడి తీసుకొస్తూ కనీసం స్థానికులను కూడా సంప్రదించకుండా ఏకపక్షంగా విచారణ చేసిన తహశీల్దార్ చర్యలను పై అధికారులకు తెలియజేయాలని కూడా సమావేశం తీర్మానించింది. సమావేశంలో స్థానిక సర్పంచ్ ఆవాల కన్నయ్య, ఎంపిటిసి మరడాన సింహాచలం, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు, తోటపల్లి దేవాలయం మాజీ చైర్మన్ సత్యంనాయుడు, చినకుదమ మాజీ సర్పంచ్ వెంకటనాయుడు, జియ్యమ్మవలస మండల టిడిపి అధ్యక్షులు తాతబాబు, వైసీపీ నాయకుడు గౌరునాయుడు, మాజీ సర్పంచులు, గౌరీపురం, గిజబ, ఖడ్గవలస, నందివానివలస, పిట్టలమెట్ట, రావివలస తదితర గ్రామాల నుంచి ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో 'అవిశ్వాసం'

అభివృద్ధి కోసమా? అధికార దాహమా? : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజాప్రతినిధులు పార్టీ ఫిరాయించేలా ప్రోత్సహించడం ప్రలోభ గురి చేయడం ఎంతవరకు సమంజసమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ, బి వి రమణ, పట్టణ నాయకులు పాకల సన్యాసిరావు ప్రశ్నించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ప్రధానమైన కుల సమీకరణలు కలిగిన వర్గాలకు కూడా తీవ్ర అసంతృప్తి కలిగించేలా అవిశ్వాస తీర్మాన ప్రతిపాదన ఉందన్నారు. పట్టణ అభివృద్ధికి కృషి చేయకుండా పార్టీ ఫిరాయించేందుకు, ఫిరాయింపుదారులను కాపాడుకునేందుకు అధికార ప్రతిపక్ష పార్టీలు లక్షల రూపాయలు కుమ్మరిస్తున్నాయన్న గుసగుసలు కూడా వినిపిస్తున్నాయన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి, పార్వతీపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎట్టి పరిస్థితుల్లోనూ మంచిది కాదన్నారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు సేవ చేయాలన్న చిత్తశుద్ధి ప్రజా ప్రతినిధులకు ఉండాలని అన్నారు. ఇప్పటికైనా ధన ప్రమేయంతో పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించకుండా పాలన సజావుగా సాగేలా, పట్టణ ప్రజల మౌలిక సమస్యలైన మంచినీరు, పార్వతీపురం పట్టణ అభివృద్ధికి గతంలో టిడిపి మంజూరు చేసిన కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి, ట్రాఫిక్ నియంత్రణ వంటి సమస్యలు పరిష్కారానికి అధికార పక్షం ప్రయత్నించాలని వారు డిమాండ్ చేశారు.

సారా రహిత రాష్ట్రంగా కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆ దిశగా అందరూ సారా నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు కోరారు. జియమ్మవలస మండలంలోని గడసింగపురం, శిఖబడి గ్రామాల్లో నవోదయం 2.0 గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటు సారా వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో ఎవరైనా నాటుసారా అమ్మినా, వంటకాలు చేసిన సమాచారం అందించాలని కోరారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని బొద్దిడి, శ్రీరంగపాడు, లాడ, కొత్తవలస గ్రామాల్లో కూడా 2.0 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనాథుడు

కురుపాం ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు రాజశేఖర్, జియమ్మవలస ఎస్ఐ వసంత కుమార్, పంచాయతీ కార్యదర్శి జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో టిబి పరీక్షలు

ప్రజాశక్తి - మక్కువ

క్షయ వ్యాధి అనుమానితులకు క్షయ వ్యాధి తీవ్రత ఎలా ఉంది తెలుకోడానికి ఐసిఎంఆర్ అధ్వర్యంలో మొక్కులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం సెంట్రల్ టిబి డివిజన్ వాళ్ళ సి-వై టిబి పరీక్షలు కొత్తగా ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ పరీక్షలు మక్కువ ప్రాథమిక హాస్పటిల్‌లో టిబి అనుమానితులకు పరీక్షలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఈ పరీక్ష 48 గంటల తర్వాత ఫలితం వస్తుందని, పాజిటివ్ వస్తే టిబి ఇన్ఫెక్షన్ రాకుండా మందులు ఇవ్వడం జరుగుతుందని డాక్టర్ హరికృష్ణ తెలిపారు. ఈ పరీక్షలు ఎక్కువగా టిబి మందులు వాడుతున్న రోగులు కుటుంబ సభ్యులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి చేస్తారు. ఎందుకంటే టిబి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే ముందుగా ఈ హైరిస్క్ గ్రూప్ వాళ్లకు ఈ పరీక్షా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హరికృష్ణ, మెడికల్ ఆఫీసర్, నరేష్, టిబి సూపర్వైజర్ నిర్మల, సిహెచ్ఒ, హెచ్‌వి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట, ఆదివాసీ గిరిజన గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం హెచ్‌డిఎఫ్‌సి సహకారంతో వాసన్ సంస్థ మూడేళ్ళ పాటు నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాల ద్వారా లబ్ది పొందిన రైతులతో సీతంపేట మండలం నౌగడ గ్రామంలో వాసన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సంధర్భంగా పిఒ మాట్లాడుతూ వాసన్ సంస్థ చేపడుతున్న వ్యవసాయం, ఆర్థికాభివృద్ధితో 4వేల కుటుంబాలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. ఈ మేరకు హెచ్‌డిఎఫ్‌సి (పరివర్తన) బ్యాంక్ వాసన్ సంస్థ మూడేళ్ల పాటు భామిని, వీరఘట్టం, సీతంపేట మండలాల్లో వేల కుటుంబాలకు సహకారం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో

స్టాళ్లను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలను అందిపుచ్చుకుని గిరిజనులు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పన్నుల వసూళ్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నులు చెల్లింపుపై 50శాతం వడ్డీ మాఫీ ప్రకటించడంతో పాటు ఈ నెలాఖరుకు పన్నులు వసూలు చేయాల్సి ఉండడంతో గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మున్సిపల్ రెవెన్యూ అధికారులతో పాటు కార్యాలయంలో గల పలు విభాగాల అధికారులు, సచివాలయాల సెక్రటరీలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రధాన రహదారిలో ఉన్న వాణిజ్యసముదాయాల పన్ను బకాయలను, పలు వార్డుల్లో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్ను బకాయిల వసూళ్లను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల్లో భాగంగా ప్రధాన రహదారిలో ఉన్న పలు కూడళ్ల వద్ద 50శాతం వడ్డీ మాఫీపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నెలాఖరులోగా నేరుగా మున్సిపల్ కార్యాలయానికి గానీ, మీ వార్డు పరిధిలో ఉన్న సచివాలయాలకు గానీ చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని అన్నారు. వసూళ్లలో పిపిఒ ప్రమీలారాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు, సచివాలయాల సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి వంటి రద్దీగా వున్న ప్రదేశాలలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చోరీ చేసే నిందుతుడుని అరెస్టు చేసి, 7 లక్షల రూపా యలు విలువ చేసే 17 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొంత కాలంగా రద్దీ గల ప్రదేశాలలో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను లక్ష్యంగా చేసుకుని ద్విచక్ర వాహనాలను దొంగిలించిన వారిని పట్టుకో వాలని జిల్లా సిసిఎస్ పోలీసులు బృందాలుగా ఏర్పడ్డారు. ద్విచక్ర వాహనాలను దొంగతనం జరిగే ప్రదేశాలలో వున్న సిసి పుటేజ్‌లను పరిశీలించగా, ఒక వ్యక్తి నడిచి రైల్వే స్టేషన్ వైపు వచ్చి తిరిగి మోటార్ సైకిల్‌పై రైల్వే స్టేషన్ నుండి వెళ్ళడం గమనించి మార్గంలోని కనెక్టింగ్

పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

సిసిటివి పుటేజ్‌లను అన్నింటిని పరిశీలించారు. మోటార్ సైకిల్ మోడల్, రిజిస్ట్రేషన్ నంబర్ స్పష్టమైన దృశ్యాన్ని, నిందుతుడి స్పష్టమైన ముఖచిత్రాన్ని గుర్తించి, అతన్ని నిజమైన నేరస్థుడిగా నిర్ధారించి అతని ఆచూకి కోసం ప్రత్యేక బృందాలు గాలించి పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిందితుడు గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన నిమ్మల శివాజీగా గుర్తించారు. అతన్ని అరెస్టు చేశామని ఎస్‌పి తెలిపారు. అనంతరం పోలీసు బృందాలను ప్రత్యేకంగా అభినందించారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన సింగారపు మహేష్ మద్యానికి బానిసై తల్లిదండ్రులు, భార్య మందలించిందని మనస్థాపం చెంది మంగళవారం ఇంట్లో ఉన్న పురుగు మందు తాగాడు. వెంటనే గుర్తించిన భార్య, తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆయనను పార్వతిపురంలో ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి సింగారపు గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం. రాజేష్ తెలిపారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ప్రజాశక్తి - పాలకొండ

ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఉద్యోగుల పెన్షనర్ల వైయస్సార్ విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దు లిల్లీ పుష్పనాదం విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు అవుతున్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ముందుకు రావడంలేదన్నారు. ఐఆర్ ఇస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. వేతన సవరణ కమిషన్ ఇంతవరకు నియమించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన పిఆర్సి అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. జీతాలు, పెన్షన్లు ఉద్యోగులకు ఇవ్వాలన్నారు. సచివాలయ ఉద్యోగుల పరిస్థితి కూడా గందరగోళంగా ఉందని, వారిని ఎక్కడ వేస్తారో కూడా తెలియడంలేదని, దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు.

రబ్బర్ డ్యామ్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థుల అంతరాష్ట్ర సైన్స్ ఎక్స్పోజర్ సందర్శనలో భాగంగా గురువారం 130 మంది వివిధ మండలాల నుంచి వచ్చిన విద్యార్థులు జంఝావతి రబ్బరు డ్యాములను సందర్శించారు. 130 మంది విద్యార్థులు 40 మంది ఉపాధ్యాయులు 4 బస్సుల్లో ఒడిశాలోని రాయగడ, ఇతర ప్రాంతాలను చూడ్డానికి డిఇఒ ఆదేశాల మేరకు సందర్శనకు వచ్చారు. ముందుగా నాగావళి నది పక్కన ఉన్న చాలా పదం పార్కును విద్యార్థులు సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించి రబ్బరు డ్యాము విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. విజ్ఞానయాత్రలో భాగంగా వివిధ ప్రాంతాలకు సందర్శన కోసం వచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.